

వనపర్తి జిల్లా చీర్కపల్లిలో రహదారిపై బైఠాయించిన రైతులు, రైతుసంఘం నాయకులు

## కొనుగోళ్ల నిలిపివేతపై రైతుల మండిపాటు

- **వనపర్తి జిల్లా చీర్కపల్లిలో రాస్తారోకో**

గోపాల్‌పేట, మే 20 : ధాన్యం కొనుగోళ్లను నిలిపివేయడాన్ని నిరసిస్తూ మంగళవారం వనపర్తి జిల్లా ఏదుల మండలం చీర్కపల్లిలో ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ.. పది రోజులుగా లారీలు లేవని 7,500 బస్తాల ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచారని తెలిపారు. దీనికితోడు కొనుగోళ్లు జరపకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి సెంటర్‌కు కనీసం 3 లారీలైనా కేటాయిస్తే సమస్య ఉండదని సూచించారు. రైస్ మిల్లర్లు క్వింటాకు 3 కిలోలకుపైగా తరుగు తీస్తుండటంతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.



వికారాబాద్ జిల్లా అప్పాయిపల్లిలో నిరసన చేపట్టిన రైతులు

## పరిహారం కోసం రైతుల నిరసన

- **ప్లాటు, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్**
- **వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం అప్పాయిపల్లిలో అన్నదాతల ఆందోళన**

కొడంగల్, మే 20: భూసేకరణలో భాగంగా తమకు పూర్తిస్థాయి పరిహారం అందించాలని బాధిత రైతులు నిరసన చేపట్టారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం అప్పాయిపల్లి గ్రామ సర్వే నంబర్ 19లో ప్రభుత్వం మెడికల్, వెటర్నరీ కళాశాల నిర్మాణానికి భూ సేకరణ చేపట్టింది. రైతులకు పూర్తి స్థాయి నష్టపరిహారాన్ని అందించలేదని బాధిత రైతులు మంగళవారం రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్, రైతులు మల్లేశ్, అశమ్మ, బసప్ప, అమృతప్ప, శేఖర్ మాట్లాడుతూ.. సర్వే నంబర్ 19లో భూమి లేని రైతులకు ప్రభుత్వం అప్పనంగా నష్టపరిహారాన్ని అందజేసిందని, సంబంధిత రైతులకు పూర్తి స్థాయి నష్టపరిహారాన్ని అందించలేదని ఆరోపించారు. భూమిలేని వారికి అందించిన పరిహారాన్ని రికవరీ చేసి వారిపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. భూమి కోల్పోయిన రైతులకు ఎకరానికి 125 గజాల ప్లాటు, ఇంటికో ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతోపాటు అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. ఈ నిరసనలో మాజీ ఉప సర్పంచ్ నరసప్ప, రాములుగౌడ్, సావిత్రమ్మ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన కేసీఆర్ కృషి

- **కోతకు వచ్చిన ఆయిల్‌పాం పంట**
- **నాలుగేండ్ల క్రితం ప్లాంటేషన్‌కు బీఆర్ఎస్ సర్కార్ ప్రోత్సాహం**
- **రేపు అంకాపూర్‌లోని తోటలో ఆయిల్‌పాం గెలలు హార్వెస్టింగ్**
- **నిజామాబాద్ జిల్లాలో తొలిసారిగా పంట కోత**



నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌లో రైతు వెంకట్‌రెడ్డి క్షేత్రంలో కోతకు వచ్చిన గెలలు

నిజామాబాద్, మే 20 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): ఇందూరు జిల్లా ఇప్పుడు నూనె గింజల సాగులోనూ ప్రత్యేకతను చాటుకుంటున్నది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో రైతు మార వెంకట్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో 2022లో నాటిన ఆయిల్ పాం మొక్కలు ఇప్పుడు ఏపుగా పెరిగి గెలలు వచ్చాయి. గురువారం ఆయిల్‌పాం గెలలను కోసేందుకు ఉద్యాన శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ ఉద్యానశాఖ ద్వారా ఉద్యమం మాదిరిగా నూనె గింజల సాగుకు ప్రోత్సాహం అందించారు. తద్వారా ఆదర్శ రైతులు చాలామంది ముందుకు వచ్చారు. సాగులో మెలకువలు నేర్చుకుని ఆయిల్ పాం మొక్కలు నాటారు. అవి ఇప్పుడు ఆదాయ మార్గాన్ని సృష్టిస్తున్నాయి. నాలుగేండ్ల రైతు శ్రమకు ఫలితమే అంకాపూర్‌లో గురువారం కనిపించనున్నది. కేసీఆర్ స్ఫూర్తితో 2022లో 2,632 ఎకరాల్లో, 2023లో 1,982 ఎకరాలు, 2024లో 989 ఎకరాల్లో మొత్తం జిల్లాలో 5,604 ఎకరాల్లో ఆయిల్ పాం సాగుకు నోచుకున్నది.

### కేసీఆర్ నాటిన బీజం

నూనె గింజల సాగుపై బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలను అందించింది. దేశవ్యాప్తంగా డిమాండ్ ఉన్న ఆయిల్‌పాం సాగును పెద్ద ఎత్తున సాగు చేసేందుకు కేసీఆర్ నిర్ణయించారు. ఆయిల్ పామ్ సాగుకు అంగీకారం తెలిపిన వారిని గుర్తించి శిక్షణ ఇప్పించారు. ఆర్మూర్ మండలం చేపూర్ శివారు నర్సరీలో మొక్కలు సిద్ధం చేసి ఔత్సాహికులకు అందించారు. జిల్లావ్యాప్తంగా ఆయిల్ ఫామ్ సాగుకు రైతులు ముందుకు రాగా, ప్రయోగాత్మక సాగు దిగ్విజయమై పంట కోత దశకు చేరింది. జిల్లాలో ఆయిల్ పాం సాగు చేసే రైతులతో ప్రియూనిక్ ఇండియా లిమిటెడ్ కంపెనీ బైబ్యాక్ ఒప్పందం చేసుకున్నది. ఈ సంస్థ చేపూర్‌లో ఆయిల్‌పాం మొక్కలను పెంచేందుకు నర్సరీని నిర్వహించింది. ఇప్పుడు అంకాపూర్‌లో రైతు మార వెంకట్‌రెడ్డి క్షేత్రం నుంచి గెలలను కోసి నూనె తయారీకి ఇదే కంపెనీ ఏర్పాట్లు చేస్తున్నది.

### కేసీఆర్ ప్రభుత్వం ప్రోత్సహించింది..



నిజామాబాద్ జిల్లాలో ఆయిల్‌పాం సాగును కేసీఆర్ ప్రభుత్వం ప్రోత్సహించింది. అనేక రాయితీలు, డ్రిప్ సహకారం అందించింది. భూములు సారవంతంగా ఉండటం.. పసుపు పండించిన నేల కావడం, నీరు సమృద్ధిగా అందుబాటులో ఉండటంతో గెలలు 36 నెలల్లోనే చేతికి వచ్చాయి. జిల్లాలో ఆయిల్ పాం సాగు చేసి తొలి పంటను విక్రయిస్తున్న మొదటి రైతును నేనే కావడం సంతోషంగా ఉంది.

**- మార వెంకట్‌రెడ్డి, ఆయిల్‌పాం రైతు**



### ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోళ్లు

ఆయిల్ పాం సాగు చేసిన రైతుకు లాభాలు అందించడమే ధ్యేయంగా బైబ్యాక్ ఒప్పందాలను గత సర్కారు కుదిర్చింది. నిజామాబాద్ జిల్లాలో 2022లో 2,600 ఎకరాల్లో సాగు చేశారు. ఇప్పుడు మూడేండ్లు పూర్తయ్యింది. ఆయిల్‌పాం గెలలను బైబ్యాక్ ఒప్పందంలో భాగంగా నేరుగా ప్రియూనిక్ కంపెనీయే కొనుగోలు చేస్తుంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరనే రైతులకు చెల్లిస్తాం. ఇందులో మధ్యవర్తిత్వం ఉండదు. మోసానికి తావు లేదు.

**- రోహిత్, ప్రియూనిక్ కంపెనీ, నిజామాబాద్ జిల్లా మేనేజర్**



రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో జీలుగ విత్తనాల కోసం కొనుగోలు కేంద్రం వద్ద గుమిగూడిన రైతులు

## జీలుగ కోసం రైతన్న బారులు

- **ఇప్పటికే నెలన్నర ఆలస్యం**
- **ధర రెండింతలు పెరగడంతో ఆందోళన**

ఎల్లారెడ్డిపేట, మే 20 : జీలుగ విత్తనాల కోసం రైతులు బారులు తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలానికి మంగళవారం జీలుగ విత్తన బ్యాగులు రావడంతో రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఇప్పటికే నెలన్నర ఆలస్యం కాగా, 24 గ్రామాలకు కేవలం 500 బ్యాగులే వచ్చాయి. ఇందులో మండల కేంద్రానికి చెందిన చైతన్య వీవోకు 250, కోరుట్లపేట భాగ్యశ్రీ వీవోకు 250 చొప్పున అందించగా, మండల కేంద్రానికి రైతులు పెద్ద సంఖ్యలో వచ్చారు. దీనికితోడు గతంలో రూ.1,125 ఉన్న బ్యాగును సబ్సిడీ అని చెప్పి రూ.2,136కు అమ్ముతున్న విషయం తెలుసుకుని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్కువ బ్యాగులు రావడం, రైతులు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో వారిని చూసి చాలామంది తిరిగి వెళ్లిపోయారు. ఈ విషయమై వ్యవసాయాధికారులను వివరణ కోరితే ఇండెంట్ పెట్టామని రెండు, మూడు రోజుల్లో వస్తాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సరైన సమయంలో తక్కువ ధరకు తీసుకెళ్లిన రోజులను గుర్తుచేసుకుంటూ ప్రస్తుత ప్రభుత్వ పనితీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## విద్యుత్తు షాక్‌తో ఇద్దరు రైతులు మృతి

- **కామారెడ్డి జిల్లా కంబాపూర్‌లో ఘటన**



రాములు, హన్మయ్య (ఫైల్)

పెద్ద కొడప్‌గల్ (పిట్లం), మే 20: విద్యుత్తు షాక్‌తో ఇద్దరు రైతులు మృతిచెందారు. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కంబాపూర్‌కు చెందిన ఆగమప్ప వ్యవసాయ భూమిని శివరాం కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. బోరుబావి మోటరు చెడిపోవడంతో మరమ్మతుల కోసం గ్రామానికి చెందిన రైతులు ఎర్ర హన్మయ్య (55), సంగం రాములు (42)ను శివారం మంగళవారం తీసుకెళ్లాడు. బోరుబావి నుంచి మోటర్‌ను తీస్తున్న క్రమంలో ఇనుపపైపులు పైనున్న విద్యుత్తుతీగలకు తగిలి హన్మయ్య, రాములు అక్కడికక్కడే మృతిచెందారు. శివరాంకు గాయాలయ్యాయి. మృతదేహాలను బాన్సువాడ ప్రభుత్వ ఏరియా దవాఖానకు పోలీసులు తరలించారు.

## దిగుబడులు రాక మరో రైతు ఆత్మహత్య

- **జనగామ జిల్లా కూనూరులో విషాదం**



రాజిరెడ్డి(ఫైల్)

జఫర్‌గఢ్, మే 20 : దిగుబడులు రాక.. అప్పులు తీర్చే పరిస్థితి లేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కూనూరులో చోటుచేసుకున్నది. కూనూరు గ్రామానికి చెందిన రొంటాల రాజిరెడ్డి(32) తనకున్న ఎకరన్నర భూమితోపాటు ఆరున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ ఏడాది పంటల పండక సుమారు రూ.10 లక్షల వరకు అప్పులయ్యాయి. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజిరెడ్డి ఉరేసుకున్నాడు. ఇంటికి వచ్చిన భార్య గమనించి, స్థానికులకు తెలిపింది. వారు కిందికి దింపేసరికి రాజిరెడ్డి మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### తప్పును కప్పిపుచ్చేందుకు హార్డ్‌డిస్క్ మాయం

- **మహిళ ఫొటోను మార్ఫింగ్ చేసిన రాజ్‌భవన్ ఉద్యోగి**

ఖైరతాబాద్, మే 20 : సహ ఉద్యోగిని ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి, సస్పెండైన ఓ ఘనుడు ఏకంగా హార్డ్ డిస్క్‌నే మాయం చేశాడు . రాజ్‌భవన్ కార్యాలయంలో ఈ తతంగం జరగ్గా, విషయాన్ని బయటకు పొక్కకుండా అధికారులు జాగ్రత్త పడడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజ్‌భవన్ క్వార్టర్స్‌లో నివాసముండే టీ శ్రీనివాస్ రాజ్‌భవన్ ఐటీ సెల్ విభాగంలో హార్డ్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 10న ఓ మహిళా ఉద్యోగిని తన ఫొటోను అసభ్యకరంగా మార్ఫింగ్ చేశారని, అధికారుల దృష్టికి తీసుకొచ్చింది. దీంతో శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆతర్వాత శ్రీనివాస్‌ను రాజ్‌భవన్ అధికారులు సస్పెండ్ చేశా రు. బెయిల్‌పై బయటకు వచ్చిన శ్రీనివాస్ ఈ నెల 14న రాత్రి అనధికారికంగా రాజ్‌భవన్‌లోకి ప్రవేశించి హార్డ్‌డిస్క్ తీసుకెళ్లినట్టు గుర్తించారు. దీంతో మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శ్రీనివాస్‌ను అరెస్ట్ చేశారు.



ఆదిలాబాద్ పట్టణంలో ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

## చిరు వ్యాపారులపైకి బుల్డోజర్

**ఆక్రమణల పేరిట దుకాణాల తొలగింపు • అడ్డుకున్న చిరువ్యాపారుల అరెస్ట్**

ఆదిలాబాద్, మే 20(నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ పట్టణంలో రోడ్డు పక్కన ఉన్న చిరువ్యాపారుల దుకాణాలపైకి బుల్డోజర్ వెళ్లింది. మంగళవారం పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను మున్సిపల్ అధికారులు, పోలీసులు తొలగించారు. పట్టణంలోని శివాజీ చౌక్, అంబేద్కర్ చౌక్, గాంధీ చౌక్, దేవిచంద్ చౌక్‌లో రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లో తోపుడు బండ్లు, షెడ్లు వేసుకుని చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఆక్రమణల ఫలితంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుండగా.. మున్సిపల్ అధికారులు 201 మంది వీధి వ్యాపారులను గుర్తించి వారికి పట్టణంలోని ప్రభుత్వ స్థలంలో వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అధికారులు సూచించిన స్థలంలో తమ వ్యాపారాలు సాగవని, తాము ఉపాధి కోల్పోతామని ఆక్రమణల తొలగింపును అడ్డుకునేందుకు ప్రయత్నించిన పలువురిని పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### మునీర్ కుటుంబానికి అండగా ఉంటాం

- **ఐజేయూ, టీయూడబ్ల్యూజే నేతల భరోసా**

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): సీనియర్ పాత్రికేయుడు, తెలంగాణ ఉద్యమకారుడు మునీర్ అనారోగ్యానికి గురికావడం బాధాకరమని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజేయూ)జాతీయ అధ్యక్షుడు, మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు సంఘం(టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే విరాహత్ అలీ, కే రాంనారాయణ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మునీర్ చికిత్సకు అయ్యే ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించడాన్ని వారు స్వాగతించారు. మునీర్ కుటుంబం ఆందోళన చెందవద్దని, అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

- **ఖాళీ బిందెలతో మహిళల నిరసన**



ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని అశోక్‌నగర్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు ఆందోళనకు దిగారు. పది రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదంటూ మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. - ఇచ్చోడ

## కార్పొరేట్ విధానాలపై ఐక్య పోరాటాలు

- **సెంట్రల్ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట ఎస్కేఎం ధర్నా**

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలు ఉపసంహరించే వరకు ఐక్యంగా పోరాడుదామని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం), కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం సెంట్రల్ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్కేఎం రాష్ట్ర కన్వీనర్లు టీ సాగర్, పశ్య పద్మ మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతోపాటు, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు రుణాలు రద్దుచేసి, కౌలు రైతుల రక్షణకు సమగ్రచట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇండో-అమెరికన్ ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్లు తిరస్కరించడంతోపాటు, ఉపాధిహామీ పథకం రోజువారీ కూలీ రూ.600కు పెంచాలని కోరారు. రైతులు పండించే ఉత్పత్తులకు కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరారు. కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పాలడుగు భాస్కర్, వెంకటేశ్, సూర్యం, ఎం శ్రీనివాస్, చంద్రశేఖర్, పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్యదర్శి నాగేశ్వరరావు ఉన్నారు.

## మహాలక్ష్మి సర్వీసుల్లో వేధింపులు ఆపాలి

- **ఆర్టీసీలో పోరాట దినాన్ని పాటించిన కార్మికులు**

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): మహాలక్ష్మి సర్వీసుల్లో విధులు నిర్వర్తించే డ్రైవర్లు, కండక్టర్లపై ఉన్నతాధికారుల వేధింపులు వెంటనే ఆపాలని ఆర్టీసీ సిబ్బంది డిమాండ్ చేశారు. ప్రతిఏటా మే20న నిర్వహించే పోరాటదినంలో భాగంగా ఆర్టీసీ సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం బ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాలక్ష్మి సర్వీసుల్లో నగదు ఎక్కువగా తీసుకురావాలని డీఎంలు వేధిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. ఎంవీ యాక్ట్-2019లో సవరణలు చేయాలని పేర్కొన్నారు. ఆర్టీసీ యాజమాన్యమే ఎలక్ట్రిక్ బస్‌లు కొనుగోలు చేసి, వాటి నిర్వహణ చూసుకోవాలని కోరారు. కార్మిక సంఘాలపై ఉన్న ఆంక్షలు తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జులై 9న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## వేసవిపూట బావిలో నీటి ఊట

- **7 మీటర్ల మేర ఉబికివచ్చిన గంగ**
- **వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటలో వింత**
- **అంజన్న మహిమ అంటున్న భక్తులు**
- **భూమి పొరల పగుళ్లే కారణమన్న భూగర్భ జలశాఖ**

వెల్గటూర్, మే 20: మూడు నెలల క్రితం ఎండిపోయిన వ్యవసాయ బావిలో మండు వేసవిలో నీరు ఉప్పొంగిన ఘటన జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. కిషన్‌రావుపేట శివారులో అన్నమనేని సాధరావుకు చెందిన వ్యవసాయ బావి మూడు నెలల క్రితం అడుగంటి పోయింది. ఆ భూమిని ఆనుకుని ఇంజపురి అంజి అనే హనుమాన్ భక్తుడికి కొంత భూమి ఉంది. అందులో సీతారాముల గుడి నిర్మించుకొని పూజలు చేస్తున్నాడు. మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో పూజ చేసుకుంటున్న సమయంలో బావి నుంచి పెద్ద శబ్దం వచ్చింది. అటుగా వెళ్లి చూడగా బావి అడుగు నుంచి 7 మీటర్ల పైకి ఎగచిమ్ముతూ నీరు ఉబికి రాగా, ఆంజనేయ స్వామి మహిమగా భావించి పూజలు చేశాడు. నీటి ఊట నాలుగు గంటలపాటు కొనసాగింది. విషయం తెలిసి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బావి వద్దకు చేరుకున్నారు. ఈ ఘటనపై భూగర్భజల శాఖ అధికారులను వివరణ కోరగా, భూమిలోపల పగుళ్లు, సుదీర్ఘకాలంగా నిల్వ ఉన్న నీటి ఒత్తిడి వల్ల ఇలా జరిగే అవకాశం ఉందని విశ్లేషించారు. ఇది అరుదుగా కనిపించే ప్రకృతి వైపరీత్యమని పేర్కొన్నారు.



వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటలో ఎండిపోయిన వ్యవసాయ బావి నుంచి ఉబికివస్తున్న నీరు

## 'దుంప సాగు' పెంపునకు కార్యాచరణ

- **ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్‌జనరల్ డాక్టర్ సుధాకర్ పాండే**



హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): దేశంలో దుంప కూరగాయల సాగును పెం పునకు కార్యాచరణ రూపొందిస్తామని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్)అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుధాకర్ పాండే వెల్లడించారు. రాజేంద్రనగర్ ఉ ద్యాన కళాశాల వేదికగా రెండ్రోజులపాటు జరిగిన దుంప కూరగాయలపై అఖిల భారత స మన్వయ పరిశోధన పథకం సదస్సు ము గింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాలను క్లస్టర్లుగా చేసి దుంప పంటల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేయాలని సూచించారు. కందలో డ్రిప్ ఇరిగేషన్, దూదిపురుగు నియంత్రణ పద్ధతులపై పరిశోధనలను ముమ్మరం చేస్తామని తెలిపారు. వచ్చే ఐదేండ్లలో దుంపకూరల జనక రకాలను సేకరించి పరిశీలించాలని శాస్త్రవేత్తలకు సూచించారు. తెలంగాణలో జూన్, జూలైలో విత్తుకోవడానికి అనుకూలంగా ఉండే శ్రీకిర రకాన్ని పరిశీలించాలని సిఫార్సులో పేర్కొన్నారు. కేంద్రీయ దుంపకూరల పరిశోధన సంస్థ డైరెక్టర్ జీ బైజు, విక్రమాదిత్య పాండే, శ్రీకుమార్, కేశవ్‌కుమార్, అనితకుమారి, కళాశాల అసోసియేట్ డీన్ పీ ప్రశాంత్, పిడిగం సైదయ్య, ప్రీతంగౌడ్, నిఖిల్, సురేశ్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

### విత్తనచట్టంలో పామాయిల్‌ను చేర్చాలి

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): కొత్తగా రూపొందించనున్న తెలంగాణ విత్తనచట్టంలో పామాయిల్ పంటను చేర్చాలని పామాయిల్ రైతుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. పామాయిల్ రైతులు జన్యుపరమైన లోపం మొక్కలతో నష్టపోకుండా చూడాలని కోరారు.

## కేయూలో ఉద్రిక్తత

- **పోలీసులు-విద్యార్థుల మధ్య తోపులాట**
- **పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్**

హనుమకొండ చౌరస్తా/నయీంనగర్, మే 20: కాకతీయ యూనివర్సిటీలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. పీజీ పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు కేయూ పరిపాలన భవనం ఎదుట మంగళవారం కూడా ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న కేయూ, హనుమకొండ పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేసినా వారు ఎంతకీ వినకపోవడంతో పోలీసులకు విద్యార్థుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. విద్యార్థులను లాక్కెళ్లి పోలీస్ వ్యాన్ ఎక్కించారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. లేడీ కానిస్టేబుళ్లు లేకుండానే తెల్లవారుజాము 3 గంటలకు వరకు తమను కేయూ పోలీసు స్టేషన్‌లో ఉంచినట్టు విద్యార్థినులు అనూష, స్వాతి పేర్కొన్నారు.



పీజీ పరీక్షలు వాయిదా వేయాని డిమాండ్ చేస్తూ కేయూ పరిపాలన భవనం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు